సాక్షి రంగారెడ్డి

గురువారం । 15 । జూన్ । 2023



పొరపాట్లను సరి చేయండి

ధరణిలో పొరపాట్లను వెంటనే సరి చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. 4లో▸



ప్రజారోగ్యంలో మనమే టాప్

ప్రజారోగ్యాన్ని కాపాడడంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 4లో▸



ప్రజారోగ్యానికి పెద్దపీట

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆరోగ్య దినోత్సవంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 4లో▸

న్యూస్‌రీల్

ఐటీ అధికారుల తనిఖీ



పరిశ్రమ ఎదుట నిలిపిన అధికారుల కారు

కొత్తూరు: మండల పరిధిలోని పెంజర్ల గ్రామ శివారులో దర్గా రోడ్డుకు సమీపంలో ఉన్న ఓ పరిశ్రమలో బుధవారం ఐటీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమైన తనిఖీలు రాత్రి వరకు కొనసాగాయి. కాగా, ఈ పరిశ్రమ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధిది అంటూ స్థానికంగా చర్చించుకున్నారు.

లా గ్రాడ్యుయేట్లకు న్యాయ పరిపాలనలో శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: న్యాయ పరిపాలనలో శిక్షణ పొందేందుకు రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన అర్హులైన షెడ్యూల్ కులాలకు చెందిన లా గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రామారావు పేర్కొన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి గుర్తింపు పొందిన, భారతదేశంలోని ఏదైనా యూనివర్సిటీ నుంచి ఏదైనా ఫ్యాకల్టీలో చేసిన డిగ్రీ, లా డిగ్రీ పొందిన వారు అర్హులన్నారు. 1 జూలై 2023 నాటికి 23 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలని, అభ్యర్థి వార్షికాదాయం రూ.2 లక్షలకు మించరాదని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోపు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

కేజీరెడ్డి కళాశాలకు అవార్డు



అవార్డును అందజేస్తున్న గవర్నర్ తమిళిసై

మొయినాబాద్: మండలంలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలను రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అభినందించారు. 2022–23లో 500 యూనిట్లకుపైగా రక్తదానం చేసినందుకు గాను ప్రత్యేక అవార్డును అందజేశారు. బుధవారం నగరంలో రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన ప్రపంచ రక్తదాతల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ కేజీరెడ్డి కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్లను అభినందించారు. ప్రతి సంవత్సరం ఇదే స్ఫూర్తితో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. గవర్నర్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.విజయలత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రత్నాచారి తదితరులు ఉన్నారు.

విద్యుత్ సిబ్బంది సేవలు భేష్



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ చైర్మన్ రఘుమారెడ్డి

ఇబ్రహీంపట్నం: విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న, అధిక లోడ్ ఉపయోగిస్తున్న వినియోగదారుల నుంచి ఫెనాల్టీ రూపంలో సంస్థకు ఆదాయాన్ని పెంచిన విద్యుత్ అధికారులను టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ చైర్మన్ పి.రఘుమారెడ్డి అభినందించారు. ఆ సంస్థ సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, చంపాపేట, సరూర్‌నగర్ డివిజన్ విద్యుత్ అధికారులను బుధవారం ఆయన సన్మానించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూ సంస్థ మనుగడకు, ఆదాయానికి కృషిచేసిన అధికారులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఆర్‌ఆర్ జోన్ సీజీఎం ఆనంద్, సరూర్‌నగర్ ఎస్‌ఈ కరుణాకర్‌బాబు, ఇబ్రహీంపట్నం, చంపాపేట, సరూర్‌నగర్ డివిజన్ ఇంజనీర్లు యాదగిరి, సురేష్, రామకృష్ణను అభినందిస్తూ ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఈ నెల 17 వరకు ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: ట్రాక్ నిర్వహణ పనుల దృష్ట్యా వివిధ మార్గాల్లో ఈ నెల 17వ తేదీ వరకు 22 ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకులింగంపల్లి– సికింద్రాబాద్–ఫలక్‌నుమా, ఉందానగర్–లింగంపల్లి, ఫలక్‌నుమా–లింగంపల్లి, తదితర రూట్లలో నడిచే రైళ్లు రద్దు కానున్నాయి.

పల్లెకో బస్ ఆఫీసర్



ఇటీవల షాద్‌నగర్‌లో విలేజ్ బస్సు ఆఫీసర్లకు బ్యాగులు, టీషర్టులను అందజేసిన సంస్థ ఈడీ పురుషోత్తం నాయక్

ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు..

- ఆర్టీసీ వినూత్న కార్యక్రమం
- డ్రైవర్లు, కండక్టర్లకు బాధ్యతలు
- నష్టాల్లోంచి సంస్థను గట్టెక్కించేందుకు చర్యలు

షాద్‌నగర్: ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు ఆర్టీసీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పనిలోపనిగా నష్టాల నుంచి గట్టెక్కడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా పల్లెకో బస్ ఆఫీసర్‌ను నియమించింది. ప్రయాణికులు, ఆర్టీసీ సంస్థకు మధ్య అనుసంధానకర్తలను నియమించి ప్రజా రవాణా వ్యవస్థను పటిష్టం చేస్తోంది. ప్రైవేటు వాహనాల పోటీ నుంచి తట్టుకొని ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు సంస్థ ఎండీ సజ్జనార్ విలేజ్ బస్ ఆఫీసర్ అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్టీసీపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేందుకు చర్యలు చేపట్టారు. సంస్థ అందిస్తున్న సేవలను ప్రయాణికులకు వివరించడం ద్వారా ఆదాయం పెంచుకునేందుకు గ్రామానికో బస్ ఆఫీసర్‌ను నియమించారు. ఆయా గ్రామాల్లో నివసించే ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు.

విలేజ్ బస్ ఆఫీసర్ల విధులివీ..

- ప్రతి 15 రోజులకోసారి వారికి కేటాయించిన గ్రామాల్లో సర్పంచులు, గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించాలి.
- ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో కాకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేలా చైతన్య పరచాలి.
- ప్రైవేటు వాహనాల్లో వెళ్తే కలిగే నష్టాలు, ఎదురయ్యే ఇబ్బందులను వివరించాలి.
- బస్సుల రాకపోకల సమయాలు, కొత్త రూట్లు, నూతన సర్వీసుల సమస్యలను సేకరించి అధికారులకు తెలపాలి.
- గ్రామాల్లో వివాహాలు, శుభకార్యాలు, జాతరలు, సంతలను దృష్టిలో పెట్టుకొని తేదీలు, వివరాలు సేకరించి వాటి రూపంలో ఆదాయం పెంచుకునే అవకాశం ఉందన్న విషయాన్ని అధికారులకు తెలియజేయాలి.
- ఆక్యుపెన్సీ రేషియోను పెంచేలా కృషి చేయాలి.
- ఆర్టీసీ సంస్థ చేపట్టిన పథకాలు, బస్‌పాసులు, రాయితీలు, కార్గో సేవలు, తిరుమల శ్రీవారి దర్శన సదుపాయాల గురించి అవగాహన కల్పించాలి.
- గ్రామాల్లో రవాణా అవసరాలు, సమస్యల వివరాలను సేకరించి వాటిని ఉన్నతాధికారులకు నివేదించాలి.

మరింత చేరువ చేసేందుకు



ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు విలేజ్ బస్ ఆఫీసర్ కార్యక్రమం ఉపయోగపడుతుంది. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం, సంస్థ అందించే రాయితీలను ప్రజలు సులభంగా తెసుకునే అవకాశం ఉంటుంది.

– నర్సింలు, విలేజ్ బస్ ఆఫీసర్, షాద్‌నగర్

బాధ్యతలు పక్కాగా నిర్వహిస్తాం



అధికారులు మాకు అప్పగించిన బాధ్యతలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ప్రయాణికుల సమస్యలను తెలుసుకొని ఉన్నతాధికారులకు వివరిస్తాం. సంస్థ ఆదాయం పెంచేందుకు తగిన విధంగా కృషి చేస్తాం.

– తిరుపతయ్య, విలేజ్ బస్ ఆఫీసర్, షాద్‌నగర్

సంస్థ ఆదాయం పెరుగుతుంది



గ్రామానికో బస్ ఆఫీసర్ నియామకం ద్వారా ఆక్యుపెన్సీ రేషియో పెరిగి ఆర్టీసీ సంస్థకు ఆదాయం పెరిగే అవకాశం ఉంది. బస్సుల రాకపోకల సమయాలు, కొత్త రూట్లు, సర్వీసు సమస్యలను సులభంగా తెలుసుకొని పరిష్కరించవచ్చు.

– ఉష, డిపో మేనేజర్, షాద్‌నగర్



న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ హరీశ్

వైద్య వ్యవస్థ బలోపేతం

- పేదలకు ఖరీదైన వైద్యం
- దేశంలోనే తెలంగాణ ఆదర్శం
- వైద్య ఆరోగ్య దినోత్సవంలో మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: రాష్ట్రాన్ని సాధించుకున్న తరువాత పేదలకు ఉచితంగా ఖరీదైన వైద్యం అందించేందుకు సీఎం కేసీఆర్ వైద్య వ్యవస్థను బలోపేతం చేశారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మీర్‌పేట ఎస్‌వైఆర్ కన్వెన్షన్‌లో జరిగిన వైద్య ఆరోగ్య దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు. ప్రజలకు వైద్యులు కనిపించే దేవుళ్లని, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన వైద్యులు, నర్సులు, ఆశా వర్కర్ల సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. సమాజంలో అమ్మ పాత్ర పోషించే ఆశావర్కర్ల జీతాలను ముఖ్యమంత్రి రెట్టింపు చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ కిట్‌తో పాటు 57 రకాల వైద్య పరీక్షలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న ఉద్దేశంతో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, నిమ్స్‌లో రెండువేల పడకల భవన నిర్మాణానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. పేదలకు వైద్యాన్ని చేరువ చేసేందుకు 500 బస్తీ దవాఖానాలు, డయాలసిస్ సెంటర్లు, కంటి వెలుగు, గుండెపోటు మరణాలు పెరుగుతున్నందున సీపీఆర్‌పై శిక్షణ, అవగాహన కల్పిస్తున్నామని మంత్రి వివరించారు. వైద్యంతో పాటు అన్ని రంగాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, ఇటీవల నీతి ఆయోగ్ సర్వేలో మన రాష్ట్రం వైద్యంలో 3, సౌకర్యాల కల్పనలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు.అనంతరం మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం గర్భిణుల్లో రక్తహీనత సమస్యను దూరం చేయటానికి ప్రవేశపెట్టిన న్యూట్రిషన్ కిట్ల పంపిణీని ప్రారంభించి మహిళలకు అందజేశారు. ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రారంభించి ఆశా, ఏఎన్‌ఎంలకు చీరలు పంపిణీ చేయడంతో పాటు ఉత్తమ వైద్యులు, నర్సులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ హరీశ్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, ఆర్డీఓ సూరజ్‌కుమార్, బాలాపూర్ తహసీల్దార్ జనార్దన్‌రావు, మీర్‌పేట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్: నిరుపేదల ఆరోగ్య సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని, వైద్య ఆరోగ్య శాఖ రంగంలో ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఈడెన్ ఫంక్షన్ హాల్‌లో వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నిరుపేదల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని అన్నారు. నూతన ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణం, ఆస్పత్రుల స్థాయిని పెంచడంతో పాటు అర్హులైన వైద్యులను నియమిస్తోందని తెలిపారు. బస్తీ దవా ఖాలు, పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు, ఆరోగ్యలక్ష్మి వంటి పథకాలతో దేశంలోనే రాష్ట్రం అగ్రభాగాన నిలిచిందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి వెంకట్, జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, జెడ్పీటీసీలు తాండ్ర విశాల, వెంకట్‌రాంరెడ్డి, శ్రీలత, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూములపై విచారణ చేపట్టాలి



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

- కందుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ధర్నా

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో భూదాన్ భూములు అన్యాక్రాంతమయ్యాయని..విచారణ చేపట్టి, అందుకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కందుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యులు ఎ.అమరేందర్‌రెడ్డి, దీప భాస్కర్‌రెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి తదితరులు మాట్లాడారు. తిమ్మాపూర్ రెవెన్యూ పరిధిలోని 14 సర్వే నంబర్లలో మొత్తం 135 ఎకరాల భూమి ధరణిలో నిషేధిత జాబితాలోనే ఉన్నాయని, తహసీల్దార్ తప్పుడు స్టేట్‌మెంట్లు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. భూదాన్ భూములను అధికార పార్టీ నేతలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని వేల కోట్ల లావాదేవీలు జరిపారని ఆరోపించారు. మండల కార్యాలయం నుంచి కలెక్టర్, ఆపై ప్రగతి భవన్ వరకు కమీషన్లు తీసుకుని రాత్రికి రాత్రి భూముల వివరాలు మార్చి కొల్లగొడుతున్నారని.. సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, ఎస్.మల్లేశ్, నర్సింహాచారి,జగదీశ్, అఫ్జల్, శ్రీధర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, యాదిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ తవ్వగా.. హరీశ్ ఎత్తగా..

- నిమ్స్‌లో 'దశాబ్ది' బ్లాక్‌కు వైభవంగా భూమిపూజ
- ఇక్కడి నుంచే 'న్యూట్రిషన్ కిట్' పథకం ప్రారంభం





సాక్షి, సిటీబ్యూరో/లక్డీకాపూల్: ప్రతిష్టాత్మక నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (నిమ్స్) ప్రాంగణంలో 'దశాబ్ది' బ్లాక్ నిర్మాణ పనులకు బుధవారం ఉదయం 11.44 గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. సీఎం గడ్డపారతో తవ్వగా మంత్రి హరీశ్‌రావు పారతో మట్టిని ఎత్తారు. కేసీఆర్ చేతుల మీదుగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పునాదిరాళ్లను వేశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన జరిగిన వైద్యారోగ్య దినోత్సవ సభలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారులు రాజీవ్ శర్మ, సోమేష్‌కుమార్, ఎంపీ కేశవరావు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, వైద్యారోగ్య ముఖ్య కార్యదర్శి రిజ్వీ, ముఖ్య సంచాలకుడు జి.శ్రీనివాసరావు, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్వేతా మహంతి, డీఎంఈ రమేష్‌రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, హైదరాబాద్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటి, డాక్టర్ మార్త రమేష్ తదితరులు పాల్గొన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల కోసం రూపొందించిన తొమ్మిది రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లను సీఎం చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం నగరానికి చెందిన గర్భిణులు పార్వతమ్మ (ఉదయ్ నగర్ కాలనీ), ఫర్వీన్ (బాలానగర్), శిరీష (ఎన్‌బీటీనగర్), తేజస్వీ (ప్రతాప్‌నగర్), సుజాత (శ్రీరాంనగర్), రేణుక (అంబేడ్కర్‌నగర్)లకు కిట్లను ఆయన అందజేశారు.

అధునాతన చికిత్సలకు కేరాఫ్ అడ్రస్‌గా నిమ్స్: డైరెక్టర్ బీరప్ప

తెలంగాణ ఉద్యమానికి నిమ్స్‌కు మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, చావు నోట్లో తలపెట్టిన సమయంలో నిమ్స్ తన వంతు సేవలు అందించింది. తెలంగాణ ఏర్పాటు సమయంలో నిమ్స్‌లో 900 పడకలు ఉండేవి. ఆ తర్వాత 1,500 పడకలకు చేరాయి. చికిత్సలు 108 శాతం పెరిగాయి. బోధన సిబ్బంది సంఖ్య 111 నుంచి 306కు పెరిగింది. పీజీ సీట్లు 82 నుంచి 169కు చేరాయి. కొత్తగా ఆరు విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. ఆరోగ్యశ్రీలో అత్యధిక చికిత్సలు అందిస్తున్న సంస్థ నిమ్సే. అవయవ మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయి. గుండె, కిడ్నీ, బోన్‌మ్యా రో, ఊపిరితిత్తుల మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయి. జీవితకాలం ఉచితంగా మందులు అందజేస్తున్నాం. తుంటి, కీళ్ల చికిత్సలు, గూని వంటి ఆపరేషన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. దక్షిణాదిలో అత్యధికం. డయాలసిస్ సేవలు 30 వేల నుంచి 1.20 లక్షలకు చేరుకున్నాయి. ఆస్పత్రిలో నెలకు 1.50 లక్షల రోగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. డైరెక్టర్‌గా నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోను.

మేం కిట్లు పంచుతుంటే.. వాళ్లు తిట్లు పంచుతున్నారు: మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ నగరం ప్రస్తుతం వ్యాక్సిన్, ఫార్మా హబ్‌గా ఉంది. రాబోయే రోజుల్లో హెల్త్ హబ్‌గా మారబోతోంది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందు వైద్య విద్య కోసం చైనా, రష్యా, ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు వెళ్లేవారు. ప్రస్తుతం జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ వచ్చింది. గతంలో 2,853 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్యను 8,340కి పెంచాం. ఆస్పత్రుల్లో పడకల సంఖ్యను కూడా 50 వేలకు పెంచాం. వచ్చే ఏడాది మరో ఎనిమిది కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించబోతున్నాం. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ సహా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఫార్మా, నర్సింగ్ వంటి అనుబంధ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో బిడ్డలకు జన్మనిచ్చిన తల్లులకు, రక్తహీనతతో బాధపడే గర్భిణులకు మేం కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్‌లు ఇస్తుంటే.. ప్రతిపక్షాలు మాత్రం తిట్లు పంచుతున్నాయి.

రక్త సేకరణలో 'గాంధీ' బ్లడ్‌బ్యాంక్ నంబర్ వన్

గాంధీఆస్పత్రి: దాతల నుంచి రక్తం సేకరించడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ తెలంగాణలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని డీఎంఈ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీఆస్పత్రి బ్లడ్‌బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని గాంధీ సూపరింటెండెంట్ రాజారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కాలంలో గాంధీ బ్లడ్‌బ్యాంకు వివిధ ప్రాంతాల్లో 59 రక్తదాన శిబిరాలను నిర్వహించి 15,260 మంది నుంచి రక్తం సేకరించి ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి అందించి రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. దాతల నుంచి సేకరించిన రక్తం వందశాతం వినియోగించేందుకు వివిధ కేటగిరీగా విభజించి, పరిశుభ్రం చేసి రోగులకు అందిస్తున్నామని వివరించారు. గాంధీ బ్లడ్‌బ్యాంకు ఇన్‌చార్జి డాక్టర్ సత్యరత్న సేవలను కొనియాడి అభినందించారు. రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్ అహ్మాడ్‌కాలేజీ, గాంధీ జూడా వైద్యులు, మాదాపూర్ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో బుధవారం రక్తదాన శిబిరాలు నిర్వహించి 157 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు గాంధీ సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, బ్లడ్‌బ్యాంకు ఇన్‌చార్జి సత్యరత్నతోపాటు హెచ్‌ఓడీలు, వైద్యులు, నర్సింగ్, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీలో రక్తదాన దినోత్సవ అవగాహన ర్యాలీ

ఆర్టీసీ బస్సును ఢీకొన్న పెళ్లి బస్సు



అప్పారెడ్డిగూడ వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టూరిస్టు బస్సు

కొందుర్గు: ఆర్టీసీ బస్సును పెళ్లిబస్సు ఢీకొన్న ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం ఉదయం పరిగి నుంచి షాద్‌నగర్ వెళుతోంది. అయితే అప్పారెడ్డిగూడ శివారు వద్ద వెళుతుండగా వెనుక వైపు నుంచి వస్తున్న పెళ్లి టూరిస్టు బస్సు ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ సంఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయంపై కండక్టర్ అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధరణి పొరపాట్లను సరి చేయండి

ఇబ్రహీంపట్నం రూరల్: ధరణితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ధరణిలో పొరపాట్లను సరి చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు రామకృష్ణారెడ్డి, ఇపట్నం మండల కార్యదర్శి చీమల మునలయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని ఎంపీపటేల్‌గూడలో తెలంగాణ రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగలేక పోతున్నారని తెలిపారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. పీపటేల్‌గూడ అధ్యక్షుడిగా యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా అంకన్న, అంజిరెడ్డి, జంగయ్య, చంద్రయ్య, సత్తయ్య, సహాయ కార్యదర్శులుగా శ్రీశైలం, బీ నర్సింహ, కే నర్సింహ, కరుణాకర్ రెడ్డి, పీ నర్సింహ, అంజయ్య, ఎట్టయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రాములు, నర్సింహ పాల్గొన్నారు.



పత్తేపురం ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ అంతరాయం

పత్తేపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై లారీ టైరు గుంతలో ఇరుక్కుపోవడంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. లారీ నిలిచిపోవడం ఓ ఎత్తు అయితే బ్రిడ్జి ప్రారంభంలో పెద్ద వాహనాలు టర్నింగ్ కాకపోవడం తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో బ్రిడ్జికు ఇరువైపులా కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జి వద్దకు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. – శంకర్‌పల్లి

ప్రజారోగ్యానికి పెద్దపీట

ఎమ్మెల్యే కాలె యాదయ్య



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మొయినాబాద్: ఒకప్పుడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అంటూ పాడుకునే పరిస్థితి నుంచి నేను పోత బిడ్డో సర్కారు దవాఖానకు అంటూ పాడుకునే స్థితికి వచ్చిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని అంజనాదేవి గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి వైద్య దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్లలో వైద్య ఆరోగ్యం పటిష్టమైందన్నారు. రాష్ట్రానికి నాలుగు కొత్త మెడికల్ కళాశాలలు వచ్చాయని.. 2014 ముందు 700 ఉన్న ఎంబీబీఎస్ సీట్లను 1,640కి పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ప్రభుత్వం ప్రతి 5 వేల నుంచి 10వేల జనాభాకు ఒక బస్తీ దవాఖాన ఏర్పాటు చేసిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 డయాగ్నొస్టిక్స్ హబ్‌లు ఏర్పాటు చేసి 42 లక్షల మందికి సేవలందిస్తుందన్నారు. ఉచిత డయాలసిస్ సెంటర్లు, కంటి వెలుగుతో కోట్ల మందికి సేవలు అందిస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేసిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు న్యూట్రీషన్ కిట్‌లు, ఎన్‌సీడీ కిట్లు, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఆర్డీఓ వేణు మాధవరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్, సీడీపీఓ శోభ, జెడ్పీటీసీలు శ్రీకాంత్, ప్రశాంతి, మాలతి, గోవిందమ్మ, సర్పంచ్‌లు నరోత్తంరెడ్డి, స్వరూప, సుకన్య, ఎంపీటీసీలు మల్లేశ్, రితీష్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో మనమే టాప్: ఎమ్మెల్యే



ఉత్తమ వైద్య సిబ్బందికి పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని ఆదిబట్ల మున్సిపల్ బొంగ్లూర్ సమీపంలో గల కళ్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన వైద్యులను, సిబ్బందిని సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఆర్డీఓ వెంకటాచారి, ఎంపీపీ కృపేష్ పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని మహిళ హత్య



యాదమ్మ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: మతిస్థిమితంలేని మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ సంఘటన బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్ పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో వెలుగుచూసింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం, చిన్నరావిరాల గ్రామానికి చెందిన సోమని యాదమ్మ(55) ఐదేళ్లుగా మతిస్థిమితం సరిగా లేక సమీపంలో ఉన్న గ్రామంలో తిరుగుతూ ఉంటుంది. కాగా, గత 15 రోజులుగా పిలాయిపల్లి గ్రామంలో తిరుగుతూ అడుక్కొని తింటూండేది. కాగా మంగళవారం రాత్రి గ్రామసమీపంలో ఉన్న దుర్గ వైన్స్ ఎదురుగా ఉన్న ఓ భవనం వెనుకాల సెల్లార్‌లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె తలపై మోదీ హత్య చేశారు. దాంతో తీవ్ర రక్తస్రావమై అక్కడిక్కడే మృతి చెందింది. అయితే బుధవారం మధ్యాహ్నం వైన్స్‌షాపులో మద్యం కొనుగోలు చేయడానికి వచ్చిన ఓ వ్యక్తి మూత్ర విసర్జన కోసం అటుగా వెళ్లగా వివస్త్ర స్థితిలో పడిఉన్న ఓ మహిళా మృతదేహం కనిపించింది. వెంటనే సర్పంచ్ అందెల హరీష్‌కు తెలపడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. డాగ్‌స్క్వాడ్ గ్రామశివారులో రోడ్డు ప్రక్కన ఉన్న బావివద్దకు వచ్చి ఆగిపోయింది. తల పగిలి ఉండటంతో దేనితో హత్య చేశారని తెలియరాలేదు. సంఘటనా స్థలంలో కూడా ఎలాంటి ఆధారాలూలభించలేదు. చివరకు వైన్స్ షాప్ ఏర్పాటు చేసిన కెమెరాల్లోని సీసీ ఫుటేజీని పరిశీలించినా, అందులో ఎలాంటి ఆనవాళ్లు రికార్డు కాలేదు. ఎవరో మద్యం మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే స్థానిక ఓ పరిశ్రమలో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడిని అనుమానించి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు. అయితే మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త లింగయ్య మాత్రం గతంలో అనారోగ్యంతో మృతి చెందాడు.

మద్యానికి డబ్బు ఇవ్వడం లేదని మట్టుబెట్టాడు

భార్య హత్య కేసులో భర్త అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు శ్రీనివాస్

కడ్తాల్: మద్యానికి డబ్బు ఇవ్వలేదని భార్యనే కడతేర్చాడో భర్త. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు.. తమదైన శైలిలో విచారించగా.. భర్తే నిందితుడని తేలింది. సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన వల్లభుదాస్ స్వరూప, శ్రీనివాస్ భార్యాభర్తలు. మద్యానికి బానిసైన శ్రీనివాస్.. మద్యానికి డబ్బులు ఇవ్వాలని తరచూ భార్యను వేధించేవాడు. ఈ విషయమై భార్య పలుమార్లు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించినా శ్రీనివాస్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. ఆరు నెలల క్రితం స్వగ్రామం వదిలి.. దంపతులిద్దరూ బతుకుదెరువు కోసం కడ్తాల్ మండలం కర్కల్‌పహాడ్ గ్రామ శివారులోని ఎస్ఎస్ ఫాంహౌస్‌లో చేరి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 11న మద్యం కోసం డబ్బు ఇవ్వాలని భార్య స్వరూపను అడుగగా, ఆమె నిరాకరించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మద్యానికి డబ్బులు అడిగినప్పుడెల్లా ప్రతిసారి తనతో గొడవపడుతోందని, ఎలాగైన అడ్డు తొలగించుకోవాలకున్నాడు. అదేరోజు మధ్యాహ్నం ఫాంహౌస్‌లో ఎవరూ లేనిది చూసి గట్టిగా గొంతు నులిమి కింద పడేశాడు. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుడు శ్రీనివాస్‌ని బుధవారం అరెస్ట్ చేసి తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ ఉపేందర్‌ను, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్‌ను, పీసీ రాంకోటిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

ఎయిర్‌పోర్టు మెట్రో ప్రీబిడ్ విజయవంతం

- హాజరైన 13 గ్లోబల్ కంపెనీలు
- ప్రాజెక్టు వివరాలను వెల్లడించిన ఎన్వీఎస్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: రాయదుర్గం నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నిర్మించనున్న ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుపై మరో అడుగు ముందుకు పడింది. సుమారు రూ.6250 కోట్ల అంచనాలతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) ప్రాతిపదికన గ్లోబల్ టెండర్‌లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం బేగంపేట్‌లోని హెచ్ఎంఆర్ కార్యాలయంలో ప్రీబిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్‌అండ్‌టీ, ఆల్‌స్టామ్, సీమెన్స్, టాటా ప్రాజెక్ట్స్, ఐఆర్‌సిఓఎస్, ఆర్‌వీఎస్ఎల్, బీఈఎంఎల్, పీఎస్‌డీఆర్ఓఎల్ రహీ టెక్నాలజీస్ తదితర జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చెందిన 13 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ ప్రాజెక్టు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఈ ప్రాజెక్టు ప్రత్యేకతలను, ఇప్పటి వరకు చేపట్టిన పనులను గురించి వివరించారు. రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు సుమారు 31 కిలోమీటర్‌ల దూరం నిర్మించనున్న ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు సర్వే, పెగ్‌మార్కింగ్, అలైన్‌మెంట్ తదితర పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. భూసార పరీక్ష కొనసాగుతుందని చెప్పారు. ఈ మార్గంలో 29.3 కిలోమీటర్‌ల ఎలివేటెడ్ కారిడార్ కాగా, 1.7 కిలోమీటర్‌ల వరకు అండర్‌గ్రౌండ్ మార్గంలో ట్రాక్ నిర్మాణం చేపట్టవలసి ఉంటుంది.ఎయిర్‌పోర్టు టర్మినల్ సమీపంలో ఒక అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్‌తో పాటు మొత్తం 9 మెట్రో స్టేషన్‌లు రానున్నాయి. ఈ సందర్భంగా రోలింగ్‌స్టాక్ (రైళ్లు), మౌలిక సదుపాయాలు, సిగ్నలింగ్ వ్యవస్థ, ట్రైన్ కంట్రోల్ సిస్టమ్, సాంకేతిక ప్రత్యేకతలు తదితర అంశాలపైన వివరంగా చర్చించారు. ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులు వ్యక్తం చేసిన సందేహాలను ఎండీ నివృత్తి చేశారు. ఈ ప్రాజెక్టు వ్యయంలో హెచ్ఎండీఏ, జీఎమ్మార్ ఎయిర్‌పోర్టు 10 శాతం చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం టెండర్లను దాఖలు చేసేందుకు జూలై 5వ తేదీ వరకు గడువు విధించిన సంగతి తెలిసిందే. టెండర్‌లను దక్కించుకున్న నిర్మాణ సంస్థ సెప్టెంబర్ నుంచి పనులను ప్రారంభించి వచ్చే 3 ఏళ్లలో పూర్తి చేయవలసి ఉంటుందని ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ల పర్యవేక్షణలో ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎంఆర్ఎల్ సలహాదారు సుభోద్ జైన్, సీఈఈ డీవీఎస్ రాజు, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్‌మోహన్, జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నందిగామ: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ న సంఘటన మండల కేంద్రమైన నందిగామ అనుభంద గ్రామం చంద్రాయన్‌గూడ శివారులో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ రామయ్య కథనం ప్రకారం వివరాలు.. చంద్రాయన్ గూడ శివారులోని శాంబవి వెంచర్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి(35) మృతి చెంది ఉన్నాడని వెంచర్ సూపర్ వైజర్ ఇచ్చిన సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు.. మృతుడికి కేవలం డ్రాయర్ మాత్రమే ఉందని, వడదెబ్బకు రెండు రోజుల ముందే మృతి చెంది ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. వెంచర్ సూపర్ వైజర్ సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు. మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

కొత్తూరు మున్సిపల్ పరిధిలో..

కొత్తూరు: గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైన సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరిగూడ శివారు సర్వే నంబర్ 267లో ఓ మృతదేహం పడి ఉందనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 60ఏళ్లు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి చేశారు.